క్రీస్తుమార్గం ఆచరణీయం

క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి

మెదక్, డిసెంబర్ 24 (నమస్తే తెలంగాణ) : శాంతి, కరుణ, సహనం, ప్రేమ పంచిన క్రీస్తు జీవనగమనం, ప్రజలకు ఆచరణీయమని ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి కొనియాడారు. మంగళవారం క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. క్రిస్టియన్లం దరూ ఈ పండుగను సంతోషంగా, ఆహ్లాదకర వాతావరణంలో కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా జరుపుకోవాలని సూచించారు. మానవత్వాన్ని చాటే ఏసుక్రీస్తు బోధనలు ప్రపంచాన్ని ఎంతగానో ప్రభావితం చేశాయని తెలిపారు. మెదక్ చర్చి మెదక్ ప్రాంతానికే తలమానికమైందని ఎమ్మెల్సీ గుర్తు చేశారు. శతాబ్ది ఉత్సవాల సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.

విద్యారంగానికి బడ్జెట్ పెంచాలి

టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్రప్రధాన కార్యదర్శి చావ రవి

మాట్లాడుతున్న టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్రప్రధాన కార్యదర్శి చావ రవి

మెదక్, డిసెంబర్ 24 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (TSUTF) నిజామాబాద్ జిల్లా 6వ మహాసభ మెదక్ జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో కార్యాలయంలో మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ప్రకటించిన మేనిఫెస్టో ప్రకారం విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయిస్తామని చెప్పింది కానీ బడ్జెట్‌లో కేవలం 7 శాతం మాత్రమే కేటాయించడం సరికాదని అన్నారు. రాష్ట్ర కోశాధికారి లక్ష్మిరెడ్డి, శ్రీనివాసరావు, పద్మారావు, రవీందర్ రెడ్డి, కవిత, అజయ్ కుమార్, సుధాకర్, నగేశ్, రవి, శేఖర్, నాగుల్ మీరా, ఏసయ్య, అశోక్, భూషణం, ప్రేమ్ కుమార్, షాకిర్ అలీ, నరసింహులు, పోచయ్య, రమేశ్ రాజు, కేవీఆర్ నాయుడు పాల్గొన్నారు.

పంటల సాగుపై అవగాహన

పెద్దశంకరంపేట, డిసెంబర్ 24 : యాసంగిపంటల సాగుపై రైతులకు రైతునేస్తం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సైంటిస్టు డాక్టర్ శంకరయ్య అవగాహన కల్పించారు. మంగళవారం మండల పరిధిలోని శివాయపల్లిలో రైతు వేదికలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో యాసంగి సాగులో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. వ్యవసాయాధికారుల సూచనలు పాటించి రైతులు అధిక దిగుబడులు పొందాలన్నారు. రసాయన ఎరువుల వాడకం తగ్గించి సేంద్రీయ ఎరువులు వాడాలన్నారు. కార్యక్రమంలో ఏవో కృష్ణ, ఏఈవోలు మమత, వినీత్, అఖిల్, తదితరులు ఉన్నారు.

నేల సంరక్షణతో అధిక దిగుబడి

రామాయంపేట, డిసెంబర్ 24 : నేల సంరక్షణతో రైతులు అధిక దిగుబడులను పొందవచ్చని వీడియో కాన్ఫరెన్స్‌లో రైతులకు శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు. మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రామాయంపేట రైతు వేదికలో హైదరాబాద్ రాజేంద్రనగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం నుచి శాస్త్రవేత్తలు రైతలకు అవగాహన కల్పించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో రామాయంపేట వ్యవసాయ శాఖ అధికారి రాజ్‌నారాయణ, వ్యవసాయ విస్తీర్ణ అధికారులు, రైతులు ఉన్నారు.

ప్రతిభను వెలికితీసేందుకు సైక్లింగ్ పోటీలు

జిల్లా స్థాయి పోటీల ప్రారంభోత్సవంలో ఎస్సై విజయ్ భాస్కర్

జిల్లా స్థాయి సైక్లింగ్ ఎంపిక పోటీలో మాట్లాడుతున్న ఎస్సై విజయభాస్కర్

అక్కన్నపేట, డిసెంబర్ 24 : ప్రతిభ ఉండి ప్రోత్సాహం కరువై మట్టిలో మణిక్యాలుగా మిగిలిపోతున్న ప్రతిభావంతులైన క్రీడాకారులను వెలికితీసేందుకు సైక్లింగ్ క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు ఎస్సై విజయ భాస్కర్ అన్నారు. మంగళవారం మండలంలోని అంతకపేటలో ఉమ్మడి మెదక్ జిల్లా సైక్లింగ్ ఎంపిక పోటీలను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతిభ ఒకరి సొంతం కాదన్నారు. పట్టుదలతో శ్రమిస్తే విజయం సాధించవచ్చునన్నారు. క్రీడాకారులు తమకు ఇష్టమైన ఆటలో పాల్గొని రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదిగే అవకాశం ఉందన్నారు. జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో విజేతలను రంగారెడ్డి జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. అంతకుముందు అండర్ 14, 17 బాలబాలికల విభాగాల్లోని ఈ క్రీడా పోటీల్లో సుమారు వంద మంది సైక్లింగ్ క్రీడాకారులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా స్థాయి నుంచి పలువురిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో నేత జంగపల్లి అయిలయ్య, పాఠశాలల క్రీడా సమాఖ్య మాజీ కార్యదర్శి పాతూరి సుజాత, సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు కాటం శ్రీనివాస్, సైక్లింగ్ ఖేలో ఇండియా జిల్లా కోచ్ కాటమీది సం జీవ్, చౌటపల్లి మాజీ సర్పంచ్ గద్దల రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రంలో అవకతవకలపై కలెక్టర్‌కు ఫిర్యాదు

చేగుంట, డిసెంబర్ 24 : నార్సింగి మండలం శేరిపల్లిలో ఏర్పాటు చేసిన ఐకేపీ కొనుగోలు కేంద్రాల్లో రైతులకు సంబంధించిన ధాన్యం తూకంలో మోసం జరిగిందని ఆరోపిస్తూ మాజీ సర్పంచ్ చెప్యాల మల్లేశం ఆధ్వర్యంలో మెదక్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్లు రైతులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇండ్ల శ్రీనివాస్, శ్రీరాం బాలేశం, రాములు, కందరి రాములు, పోకల మధు, నర్సింహులు, గజవెల్లి బాలకృష్ణ, రాచపల్లి దుర్గయ్య, చింతాల శ్రీనివాస్, శ్రీనివాస్, శివకుమార్ ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

నర్సాపూర్, డిసెంబర్ 24 : రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన నర్సాపూర్ పట్టణ సమీపంలోని అర్బన్ పార్క్ వద్ద చోటుచేసుకుంది. ఎస్సై లింగం తెలిపిన వివరాల ప్రకారం.. చిలిపిచెడ్ మండలం రాందాస్‌గూడ గ్రామానికి చెందిన ఎండ్ల బలరాం (30) బైక్‌పై సోమవారం రాత్రి హైదరాబాద్ వెళ్తున్నాడు. నర్సాపూర్ పట్టణ సమీపంలోని అర్బన్ పార్కు వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న బొలేరో వాహనం బలరాం బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఎండ్ల బలరాం అక్కడికక్కడే మృతి చెందాడు. మంగళవారం మృతుడి భార్య ఎండ్ల మంజుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై లింగం తెలిపారు.

నేడు తునికి కేవీకేకు ఉప రాష్ట్రపతి, గవర్నర్ రాక

కౌడిపల్లి, డిసెంబర్ 24 : మండలంలోని తునికీలోని ఏకలవ్య కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)లో నేడు ఉప రాష్ట్రపతి జగదీప్ దన్కడ్, గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, పలువురు కేంద్రమంత్రులు, రాష్ట్రమంత్రులు విచ్చేయనున్నారు. ఆర్గానిక్ వ్యవసాయంపై ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించి, ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులతో నేరుగా మాట్లాడనున్నారు. రైతులతో ప్రసంగానికి వీలుగా జిల్లా యంత్రాంగం, నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

పెరియార్ రామస్వామికి నివాళి

నిజాంపేట, డిసెంబర్ 24 : నిజాంపేట లోని నూతన బస్టాప్ వద్ద పెరియార్ రామస్వామి వర్ధంతిని మంగళవారం డీబీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దుబాషి సంజీవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సంజీవ్ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి పాటుపడిన మహోన్నతమైన వ్యక్తి పెరియార్ అని, ఆనాటి సమాజంలో మూఢనమ్మకాల రూపుమాపుటకు ఎనలేని కృషి చేశారని, ఆయన ఆశయాల సాధన దిశగా నేటి యువత నడుచుకోవాలన్నారు. అనంతరం పెరియర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉపసర్పంచ్‌ల ఫోరం మాజీ మండలాధ్యక్షుడు కొమ్మాట బాబు, రాములు, కృష్ణమూర్తి, కృష్ణరెడ్డి, ఎల్లం, స్వామి తదితరులు ఉన్నారు.

ఏసు చూపిన మార్గంలో నడవాలి

నర్సాపూర్‌లో కేక్ కట్ చేస్తున్న జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారి జెమ్లా నాయక్, తహసీల్దార్ శ్రీనివాస్

నర్సాపూర్, డిసెంబర్ 24 : ఏసుక్రీస్తు చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని జిల్లా వెల్ఫేర్ అధికారి జెమ్లా నాయక్ పేర్కొన్నారు. క్రీస్మస్ పురస్కరించుకొని మంగళవారం నర్సాపూర్ పట్టణంలోని సాయికృష్ణ గార్డెన్‌లో క్రిస్మస్ ఫీస్ట్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. సందర్భంగా జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారి జెమ్లా నాయక్ మండల తహసీల్దార్ శ్రీనివాస్‌తో కలిసి మాట్లాడారు. కార్యక్రమంలో ఆర్ఐ సిద్ధిరాంరెడ్డి, నర్సాపూర్ క్రిస్టియన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యుత్ వెలుగులతో..

రామాయంపేట, డిసెంబర్ 24 : క్రిస్మస్ సందర్భంగా రామాయంపేట సీఎస్ఐ చర్చి ప్రాంగణం విద్యుత్ వెలుగులతో జిగేల్ మంటుంది. మంగళవారం ఒకరోజు ముందుగానే నిర్వాహకులు సీఎస్ఐ చర్చి ప్రాంగణంలో విద్యుత్ వెలుగులతో నిర్వాహకులు ముంచెత్తారు. చర్చి ప్రాంగణం విద్యుత్ దీపాలతో బాటు రంగులతో తీర్చిదిద్దారు. విద్యుత్ దీపాలు అలంకరించడంతో పట్టణ ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. నేడు జరిగే క్రిస్మస్ పర్వదినం సందర్భంగా భక్తులు ప్రత్యేక ప్రార్థనలు చేయనున్నారు.

క్రిస్మస్‌కు ప్రార్థనా మందిరాలు సిద్ధం

పెద్దశంకరంపేట, డిసెంబర్ 24 : నేడు క్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకొని వేడుకలు నిర్వహించేందుకు చర్చిలను అందంగా ముస్తాము చేస్తున్నారు. పెద్దశంకరంపేట మండలంలో క్రిస్మస్ సందర్భంగా ప్రార్థనా మందిరాలు సిద్ధం చేశారు. క్రైస్తవులు అత్యంత వైభవంగా జరుపుకొనే క్రిస్మస్ కావడంతో వ్యాపార దుకాణాలు కిటకిటలాడాయి.

క్రిస్మస్‌కు చర్చిలు ముస్తాబు

చిలిపిచెడ్, డిసెంబర్ 24 : క్రిస్మస్ సందర్భంగా మండలం కేంద్రమైన చిలిపిచెడ్, చిట్కుల్, గంగారం గ్రామాల్లో చర్చిలను ముస్తాబు చేశారు. నేడు బుధవారం క్రీస్తు జన్మదినం సందర్భంగా ముస్తాబైన చర్చిలో ప్రార్థనలు చేయనున్నారు.

రామాయంపేట క్రిస్మస్ వేడుకలకు విద్యుత్ లైట్లతో జిగేల్ మంటున్న సీఎస్ఐ చర్చి

చిలిపిచెడ్‌లో ముస్తాబైన చర్చి, పెద్దశంకరంపేటలో సీఎస్ఐ చర్చి

ముస్తాబైన ఏడుపాయల

సీఎం రాక సందర్భంగా ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ రాహుల్ రాజ్

ఏడుపాయలలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్,అధికారులు

పాపన్నపేట, డిసెంబర్ 24 : సీఎం రాక సందర్భంగా పవిత్ర పుణ్యక్షేత్రం ఏడుపాయల వనదుర్గా మాత ఆలయం ముస్తాబైంది. మంగళవారం దేవాదాయ, పంచాయతీ రాజ్ శాఖ అధికారులతో కలిసి ఎమ్మెల్యే ఎమ్మెల్యే రోహిత్‌రావు , కలెక్టర్ రాహుల్ రాజ్, అదనపు కలెక్టర్ నగేశ్, ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి ఏర్పాట్లను పరిశీలించారు. కార్యాలయం నుంచి చీఫ్ సెక్యూరిటీ అధికారి ప్రకాశ్, కలెక్టర్ రాహుల్‌రాజ్‌తో కలిసి ఏడుపాయల పరిసరాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి బుధవార ఉదయం హెలి కాప్టర్ ద్వారా ఏడుపాయలకు చేరుకుని అమ్మవారిని దర్శించుకుంటారని సంబంధిత అధికారులు వెల్లడించారు. అమ్మవారి పూజలు అనంతరం అభివృద్ధిపనులకు శంకుస్థాపనలు చేయునట్లు తెలిపారు.

విద్యుత్ సమస్య పరిష్కారం

నమస్తే తెలంగాణ ఎఫెక్ట్

రాలమడుగు గ్రామంలోని పంట పొలంలో విద్యుత్ తీగలు సరి చేసిన అధికారులు

మెదక రూరల్, డిసెంబర్ 24 : ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా.. శీర్షికన డిసెంబర్ 16 సోమవారం 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో ప్రచురితమైన వార్తకు మెదక్ మండల విద్యుత్ శాఖ అధికారులు స్పందించారు. ర్యాలమడుగు గ్రామంలోని పంట పొలంలో కొన్ని నెలలుగా విద్యుత్ తీగలు నిలబడితే తాకే ఎత్తులో వేలాడుతున్నాయి. ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు వంగిన విద్యుత్ స్తంభాలు సరి చేయాలంటూ పలుమార్లు విద్యుత్ అధికారులకు విన్నవించినా పట్టుంచుకోలేదు. పాణాలు పోతున్నా పట్టించుకోరా శీర్షికన 'నమస్తే'లో కథనం ప్రచురితమైంది దీనికి విద్యుత్ అధికారులు స్పందించి అధికారులు విద్యుత్ తీగలు, విద్యుత్ స్తంభాలకు మరమ్మతులు చేశారు.

మెదక్ పట్టణాభివృద్ధికి నిధులు కేటాయించాలి

మెదక్ మున్సిపాలిటీ, డిసెంబర్ 24 : క్రిస్మస్ సందర్భంగా మెదక్ చర్చి వందేండ్ల సంబురాలకు విచ్చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి మెదక్ పట్టణ అభివృద్ధికి రూ.వంద కోట్ల నిధులు కేటాయించాలని బీఆర్ఎస్ పట్టణ కన్వీనర్, మున్సిపల్ కౌన్సిలర్ మామిళ్ల ఆంజనేయులు మంగళవారం విజ్ఞప్తి చేశారు. మెదక్ పట్టణ ప్రజల చిరకాల కోరిక ఔటర్ రింగ్ రోడ్డుకు ప్రత్యేక నిధులు మంజూరు చేయాలన్నారు. ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ మెదక్ మున్సిపాలిటీకి రూ. 50 కోట్ల అభివృద్ధికి నిధులు కేటాయించారని ఆ నిధులను కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు విడుదల చేయడం లేదని, వెంటనే ఆ నిధులు విడుదల చేయాలని ఆంజనేయులు డిమాండ్ చేశారు.

అంతర్జాతీయ సదస్సు విజయవంతం

సదస్సు ముగింపు వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు, యాజమాన్యం

నర్సాపూర్, డిసెంబర్ 24 : నర్సాపూర్ పట్టణ సమీపంలోని బీవీఆర్ఐటీ కళాశాలలో నిర్వహించిన ఫార్మాస్యూటికల్ ఇంజినీరింగ్ అంతర్జాతీయ సదస్సు విజయవంతమైంది. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ డాక్టర్ లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ ఈ సదస్సులో 6 ప్లీనరీ స్పీకర్లు, 4 కీలక ప్రసంగకర్తలు పాల్గొన్నారని వెల్లడించారు. ఈ సందర్భంగా మేనేజర్ బాపిరాజు, అసిస్టెంట్ మేనేజర్ అశోక్‌రెడ్డి, ఏవో సురేశ్, ఇతర హెచ్‌వోడీలు ఈ సదస్సులో ముఖ్యమైన పాత్ర పోషించారు.

అప్పుల బాధ తాళ లేక వ్యక్తి ఆత్మహత్య

నర్సాపూర్, డిసెంబర్ 24 : అప్పుల బాధతో ఓ వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన నర్సాపూర్ పట్టణంలో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. నర్సాపూర్ మండల పరిధిలోని తుజాల్‌పూర్ గ్రామపంచాయతీ అర్జు తండాకు చెందిన హలవత్ రెడ్డి (30) కూలీ. హలవత్ రెడ్డి తన కూతురు వైద్య ఖర్చుల నిమిత్తం దాదాపు రూ.5 లక్షలు అప్పు చేశాడు. అప్పు ఎలా తీర్చాలో తెలియక మనోవేదనకు గురై సోమవారం రాత్రి నర్సాపూర్ పట్టణంలోని చెరువు సమీపంలో చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య బుజ్జి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

సీఎం పర్యటనకు భారీ బందోబస్తు

బందోబస్తు ఏర్పాట్లను పరిశీలిస్తున్న మల్టీజోన్-1 ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి

మెదక్ అర్బన్, డిసెంబర్ 24 : మెదక్ జిల్లాలో సీఎం పర్యటన సందర్భంగా మంగళవారం మల్టీజోన్-1 ఐజీ చంద్రశేఖర్ రెడ్డి బందోబస్తును పరిశీలించినట్లు తెలిపారు. పర్యటన సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అని జాగ్రత్త చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. ఈ బందోబస్తును కమాండ్ కంట్రోల్ సీసీ కెమెరాల ద్వారా నిఘా ఏర్పాటు చేశామన్నారు. భద్రత విషయంలో ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. మెదక్, నిజామాబాద్, కామారెడ్డి, సిద్దిపేట, కరీంనగర్, రామగుండం, జాగిత్యాల, రాజన్న సిరిసిల్ల, నిర్మల్ జిల్లాల సిబ్బంది ఉన్నారు.

కూలీలుగా ఆశవర్కర్లు ..

చిట్కుల్ పల్లెదవాఖాన వద్ద పిచ్చిమొక్కలు తొలిగిస్తున్న ఆశవర్కర్లు

చిలిపిచెడ్, డిసెంబర్ 24 : మండలంలో ఆశవర్కర్లు కూలీలుగా మారి ఆవరణలో పిచ్చిమొక్కలను శుభ్రం చేస్తున్న సంఘటన చిలిపిచెడ్ మండలం చిట్కుల్ పల్లెదవాఖాన ఆవరణలో జరిగింది. పల్లెదవాఖాన ఆవరణ శుభ్రంగా గ్రామ పారిశుధ్య కార్మికులు చేసుకోవాల్సిన బాధ్యత ఆశవర్కర్లే చూసుకుంటున్నారు. పారిశుధ్యం, పచ్చిమొక్కల నివారణ వట్టివిపై అధికారులు పట్టించుకోవాలని ఆశవర్కర్లు కోరారు. గ్రామాల్లో గర్భిణులకు, బాలింతలకు సేవ చేయడం సమయం ఎక్కువ అవుతుందని మళ్లీ వచ్చిన తర్వాత పల్లె దవాఖాన వద్ద శుభ్రం చేయలేకపోతున్నామన్నారు. ఇప్పటికైనా పై అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

రామాయంపేట అభివృద్ధికి నిధులు కేటాయించాలి

రామాయంపేటలో మాట్లాడుతున్న బైరం కుమార్

రామాయంపేట, డిసెంబర్ 24 : రామాయంపేట అభివృద్ధికి సీఎం నిధులు కేటాయించాలని ఎస్సీ సెల్ కార్యవర్గ సభ్యుడు బైరం కుమార్ అన్నారు. మంగళవారం రామాయంపేటలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి విలేకరులతో మాట్లాడారు. గత దశాబ్ద కాలంగా మెదక్ జిల్లా చుట్టూరా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయి. మెదక్ జిల్లాలోని రామాయంపేట మాత్రం అభివృద్ధి జరుగలేదన్నారు. రామాయంపేటకు బస్సుడిపో లేదని, డివిజన్ కార్యాలయం ప్రారంభించినా ఇంతవరకు ఆర్డీవో గానీ, ఏ ఇతర సిబ్బంది లేరని అన్నారు. ఈ సమస్యలతో రామాయంపేట ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తున్నదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం మెదక్ వస్తున్నారు కనుక, తమ రామాయంపేటను దృష్టిలో పెట్టుకుని నిధులను కేటాయించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

పరిస్థితి విషమించి యువకుడు మృతి

వెల్దుర్తి, డిసెంబర్ 24 : పని చేయకుండా తిరుగుతున్న యువకుడిని తండ్రి మందలించాడు. పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దవాఖానలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందిన ఘటన మాసాయిపేట మండల పరిధిలోని బొమ్మారం గ్రామంలో చోటుచేసుకుంది. చేగుంట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బొమ్మారం గ్రామానికి చెందిన కంపె రామస్వామి చిన్న కుమారుడు ప్రశాంత్ (22) ఎలాంటి పని చేయకుండా స్నేహితులతో తిరుగుతూ సమయాన్ని వృథా చేస్తున్నాడని తండ్రి మందలించాడు. ఈ నెల 17 ఇంటి నుంచి వెళ్లిన ప్రశాంత్ రాత్రి వరకు తిరిగి రాలేదు. అదే రోజు రాత్రి సమయంలో ప్రశాంత్ స్నేహితుడు శేఖర్, రామస్వామికి ఫోన్ చేసి బొమ్మారం కల్లుదుకాణం సమీపంలో ప్రశాంత్ పురుగుల మందు తాగి కొట్టుకుంటున్నాడని తెలుపగా, తూప్రాన్‌లోని ఓ ప్రైవేటు దవాఖానకు అటు నుంచి జీడిమెట్లలోని దవాఖానకు తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంలో ఈ నెల 18న ఉస్మానియా దవాఖానలో చేర్పించి చికిత్స అందిస్తుండగా మృతిచెందాడన్నారు. తండ్రి రామస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన చేగుంట పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సర్వే పారదర్శకంగా చేపట్టాలి

జడ్పీ సీఈవో ఎల్లయ్య

సిబ్బందితో మాట్లాతున్న జడ్పీ సీఈవో ఎల్లయ్య

చిన్నశంకరంపేట, డిసెంబర్24 : ఇందిరమ్మ ఇండ్ల మొబైల్ యాప్ సర్వేను పారదర్శకంగా చేపట్టాలని మెదక్ జడ్పీ సీఈవో ఎల్లయ్య సిబ్బందికి సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని పలు గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల మొబైల్ యాప్ సర్వేను పరిశీలించి మాట్లాడారు. ఇందిరమ్మ ఇండ్ల సర్వేకు వచ్చిన సిబ్బందికి ప్రజలు సహకరించాలని కోరారు. అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లు అందించడమే లక్ష్యమన్నారు. జంగరాయి, చందాపూర్,శాలిపేట, సూరారం గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల మొబైల్ సర్వే సర్వర్ పని చేయకపోవడంతో సర్వే గంటలకొద్దిగా ఆలస్యమవుతుందని పంచాయతీ కార్యదర్శులు అధికారులు దృష్టి కి తీసుకువచ్చారు. ఇంటర్నెట్ సర్వర్ ప్రాబ్లం వల్ల సమయం వృథా అవుతుందని తెలిపారు. అనంతరం ఎంపీపీ కార్యాలయంలో ఇందిరమ్మ ఇండ్ల మొబైల్ యాప్ సర్వేపై రికార్డులను పరిశీలించారు.

క్రిస్మస్ శుభాకాంక్షలు

మెదక్ మున్సిపాలిటీ, డిసెంబర్ 24 : మెదక్ నియోజక వర్గ ప్రజలకు బీఆర్ఎస్ ఇన్‌చార్జి కంఠారెడ్డి తిరుపతిరెడ్డి మంగళవారం క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. క్రైస్తవుల ముఖ్య పండుగైన క్రిస్మస్‌ను ఆనందోత్సవాల మధ్య జరుపుకోవాలని ఆయన సూచించారు.

మోడల్ స్కూల్‌లో ఆన్‌లైన్ దరఖాస్తులు

మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ విజయలక్ష్మి

రామాయంపేట, డిసెంబర్ 24 : మోడల్ స్కూల్ ప్రవేశాలకు ఆరు నుంచి పది తరగతుల విద్యార్థులు ఈనెల 28తేదీ వరకు ఆన్‌లైన్‌లో తమ దరఖాస్తులను అందజేయాలని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ విజయలక్ష్మి అన్నారు. మంగళవారం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు తమ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో వెంటనే ఈనెల 28తేదీ వరకు ఆన్‌లైన్ చేసుకోవాలన్నారు.

ఆర్థిక సాయం

ఆర్థిక సాయం అందజేస్తున్న మాజీ ఎంపీపీ మాసుల శ్రీనివాస్

చేగుంట, డిసెంబర్ 24 : మండల కేంద్రమైన చేగుంటలో పేద ముస్లిం ఆడ పిల్ల పెండ్లి కోసం చేగుంట మాజీ ఎంపీపీ మాసుల శ్రీనివాస్ ఆర్థిక సాయం అందజేశారు. చేగుంట పట్టణానికి చెందిన ఎండీ షేక్ సన కుటుంబ సభ్యులకు మంగళవారం రూ. ఐదువేలు ఆర్థిక సాయం, 50కిలోల బియ్యం అందజేశారు. నాయకులు డీ కృష్ణమూర్తి, వేణు, రవి, కృష్ణ, ఎల్ సంతోశ్, మైనార్టీ నాయకులు ఉన్నారు.

గౌడ జన హక్కుల జిల్లా మహిళా అధ్యక్షురాలిగా నాగదేవతగౌడ్

చేగుంట, డిసెంబర్ 24 : గౌడజన హక్కుల మెదక్ జిల్లా మహిళా అధ్యక్షురాలిగా కొయ్యల నాగదేవతగౌడ్ ఎన్నికైనట్లు గౌడ జన హక్కుల పోరాట సమితి, మోకు దెబ్బ జాతీయ నాయకుడు రాగుల సిద్ధిరాములు గౌడ్ పేర్కొన్నారు. మోకు దెబ్బ రాష్ట్ర కార్యదర్శి బుచ్చన్నగారి కిషన్‌గౌడ్ ఆధ్వర్యంలో చేగుంట మండలం కర్నాల్‌పల్లి ఎల్లమ్మ దేవాలయం వద్ద జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో మెదక్ జిల్లా మహిళా కమిటీని ఎన్నుకున్నట్లు తెలిపారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కొండపూరం బాల్‌రాజ్‌గౌడ్, కోశాధికారి బాలేశంగౌడ్, ప్రధాన కార్యదర్శి ముత్యం నర్సింహులుగౌడ్, ప్రచార కార్యదర్శి సింగీతం నర్సాగౌడ్, రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

బోరు మోటరును బాగు చేయండి

చిన్నశంకరంపేట, డిసెంబర్ 24 : బోరు మోటరుకు మరమ్మతులు నిర్వహించి మంచినీటి సమస్యను తీర్చాలని మండల పరిధిలోని అంబాజిపేట బీసీ కాలనీవాసులు కోరుతున్నారు. బోరు మోటరు కాలిపోయి పదిరోజులు గడుస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బోరు మోటరు కాలిపోవడంతో తాగునీటికి నానా అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీటి కోసం వ్యవసాయ బోరుబావులను ఆశ్రయించాల్సిన దుస్థితి నెలకొందన్నారు. వెంటనే సంబంధిత అధికారులు కాలిపోయిన బోరుమోటరును మరమ్మతులు నిర్వహించి మంచినీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. లేకుంటే ఖాళీ బిందెలతో ఆందోళన చేపడతామని మహిళలు హెచ్చరించారు.

ఇండియన్ ఎయిర్ ఫోర్స్